www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -176 సోమవారం 12 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disitrcts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## సీఎం విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించిన ప్రధాని మోదీ

**రూ.13 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం**



**చెన్నై,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం తమిళనాడులో పర్యటించారు. చెన్నై మెట్రో రైలు రెండో దశలో భాగంగా రూ.4,900 కోట్ల వ్యయంతో నిర్మించిన పూందమల్లివడపళని మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌తో కలిసి పోరూరు బైపాస్ స్టేషన్ నుంచి మిగతా2లో...

## సుప్రీంకోర్టుకు మార్చ్‌గా తరలిరండి!



2లో

**యువతకు రాహుల్‌గాంధీ పిలుపు**

**ఓట్ల చోరీని అడ్డుకోవాలి.. సీఈసీ రాజీనామా చేయాలి**

**సోమవారం ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరసన ప్రదర్శన**

## ఢిల్లీలో యువతపై పోలీసుల లాఠీచార్జి!

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ ఆందోళనలు**

**సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్‌పై దాడి.. ఆస్పత్రికి తరలింపు**

**విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తల అరెస్టులు**



**న్యూఢిల్లీ,(ప్రజావినికిడి): , అక్టోబర్ 11:**దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువజన సంఘాల ఆందోళనలపై పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు కఠినంగా వ్యవహరించాయని నవతెలంగాణ కథనం పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన

మిగతా2లో...

# సర్‌తో గట్టెక్కేందుకు కమలం కుట్ర!

**● గోవాలో ఓట్ల తొలగింపుతో మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ యత్నం ● భూములు అన్యాక్రాంతం.. అభివృద్ధిని గాలికొదిలేశారు ● బీజేపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు: సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** గోవాలో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఓట్ల తొలగింపుతో మూడోసారి అధికారంలోకి రావాలని కమలం పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.గోవా కాంగ్రెస్ మిగతా2లో...



## స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

**నేతలంతా సమన్వయంతో పనిచేయాలి: చంద్రబాబు**

**అమరావతి,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సన్నాహాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముమ్మరం చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలకు సూచించారు. మంత్రులు, జిల్లా

మిగతా2లో...

## గిరిజన గ్రామాలకు అభివృద్ధి బాట!

**రహదారుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం: పవన్ కల్యాణ్**

**రూ.2,052 కోట్లతో 'అడవితల్లి బాట 2.0' పనులు**



2లో

## బారికేడ్లు తొలగించండి.. మెట్రోను నడపండి!

**● కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ● ప్రజా రవాణాను నిలిపివేయడం సరికాదు**

**● శాంతియుత నిరసనలకు అవకాశం కల్పించాలి.. అక్రమ నిర్బంధాలు వద్దు**



**న్యూఢిల్లీ,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రహదారులపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వెంటనే సమీక్షించి, శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ అవసరాలకు తప్పనిసరి కానివాటిని తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో రైళ్లు, రైల్వే సేవలను సాధారణంగా కొనసాగించాలని, ప్రజల రాకపోకలకు అనవసరమైన ఆటంకాలు కల్పించవద్దని స్పష్టం చేసింది.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జరిగిన నిరసనల నేపథ్యంలో పోలీసులు విధించిన మిగతా2లో...

## భారత్ - జపాన్ స్నేహబంధం చిరకాలం!

**● సాంకేతికత, పరిశ్రమలు, పెట్టుబడుల రంగాల్లో మరింత సహకారం**

**● హైదరాబాద్‌లో ఘనంగా జపాన్ ఫెస్టివల్2026 ● పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలే రెండు దేశాల బంధానికి పునాది: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



**హైదరాబాద్,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** భారత్, జపాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్లుగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన జపాన్ ఫెస్టివల్2026లో రాష్ట్ర విద్యుత్, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన మిగతా2లో...



2లో

## నాలుగైదు రోజుల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన!

**- ఆశావహుల జాబితా అధిష్ఠానానికి పంపించాం: రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. యాసంగి సాగు వద్దు!



2లో

## సిరిసిల్లలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టండి!

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి
- రూ.402 కోట్లతో మంజూరైన పనుల్లో జాప్యం ఎందుకు?
- కొత్త భవనం పూర్తయ్యే వరకు ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించాలి



2లో

# ఢిల్లీలో యువతపై పోలీసుల లాఠీచార్జి!

(మొదటి పేజీ తరువాయి)

సంఘాలు ఆదివారం కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో నిరసనలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయగా, లాఠీచార్జిలో కొందరు గాయపడినట్లు కథనం తెలిపింది. రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ సమీపం నుంచి జంతర్ మంతర్ వైపు ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలను పాలికా బజార్ ప్రాంతంలో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆందోళనకారులను చుట్టుముట్టి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారని, వాహనాల్లోనూ దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని కథనం పేర్కొంది. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు నిరసనల్లో పాల్గొన్నారు. సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ నిరసన ప్రాంతంలో మీడియాతో మాట్లాడుతుండగా పోలీసులు ఆయనపై దాడి చేశారని కథనం ఆరోపించింది. ఆయన స్పృహ కోల్పోయిన అనంతరం రోడ్డుపక్కన వదిలివేయగా, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆటోలో రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బ్రిట్టాస్‌ను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఇతర నాయకులు పరామర్శించారు. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీగా పోలీసు, కేంద్ర భద్రతా బలగాలను మోహరించినప్పటికీ ఆందోళనలు కొనసాగాయని కథనం వివరించింది. సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల్లో నిరసనలు, అరెస్టులు కొనసాగినట్లు పేర్కొంది. ఎన్నికల కమిషన్ వ్యవహారాలు, ఓటర్ల జాబితాపై నిరసనకారులు ప్రశ్నలు లేవనెత్తుతూ సీఈసీ రాజీనామాను డిమాండ్ చేశారు.

# సర్‌తో గట్టెక్కేందుకు కమలం కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో ఆదివారం చీఫ్టైన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండ్ వరకు నిర్వహించిన పాదయాత్రలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. గోవాలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ సొంత రాష్ట్రంలోనే పరాయివారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల భూములు, ఆస్తులు, హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్‌గాంధీ ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గోవా పర్యటనకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్యక్రమాల కారణంగా రాలేకపోయారని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ప్రతినిధిగా తాను గోవాకు వచ్చానని చెప్పారు. బీజేపీ పాలనలో రాష్ట్రంలోని భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, అభివృద్ధిని పక్కనపెట్టి స్థానిక ఆస్తులను ఇతరులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. గోవా యువత మాదకద్రవ్యాల బారిన పడుతోందని, రాష్ట్రం మాదకద్రవ్యాల సరఫరాకు కేంద్రంగా మారుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'నషా ముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి గోవాలో ఈ సమస్యను ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ ముఠాలు, భూకబ్జాదారుల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని సూచించారు. గోవా ప్రజలు గతంలో రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారని, మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని రేవంత్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు వేసే ఓట్లు బీజేపీకి లాభం చేకూర్చవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. గోవా ప్రజల హక్కులు, భూములు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోరును రాముడు, రావణుడి మధ్య పోరుతో పోల్చిన రేవంత్‌రెడ్డి.. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ దేశాన్ని ఏకం చేసేందుకు భారత్ జోడో యాత్ర చేపట్టారని, ప్రధాని మోదీ దేశంలో విభజన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గోవా ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. 2026లో కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్న రేవంత్‌రెడ్డి, 2027లో గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు త్రివర్ణ పతాకం ఎగరడం ఖాయమని వ్యాఖ్యానించారు.

**స్థానిక గుర్తింపును కాపాడేందుకు యాత్ర**

గోవా భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ 'గోయ్ రాఖోన్స్' యాత్రను చేపట్టింది. గత నెల 22న పనాజీలో ప్రారంభమైన ఈ యాత్ర 27 రోజులపాటు రాష్ట్రంలోని 40 నియోజకవర్గాలను కవర్ చేయనుంది. 18న యాత్ర ముగియనుంది. బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం తోపాటు స్థానిక హక్కుల పరిరక్షణకు మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

# గిరిజన గ్రామాలకు అభివృద్ధి బాట!

**పోలవరం జిల్లా, (ప్రజావినికిడి): అక్టోబర్ 11:** గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంతోపాటు విద్య, వైద్యం, రవాణా, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఆదివారం పోలవరం జిల్లా కాకవాడలో పర్యటించిన ఆయన 'అడవితల్లి బాట' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రహదారులు లేక గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బం దులను ప్రస్తావిస్తూ, వైద్య సేవల కోసం రోగులను డోలీలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితులు మారాలని పవన్ కల్యాణ్ అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి అధిక వ్యయం అవుతున్నప్పటికీ వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. రోడ్డు లేని గిరిజన గ్రామం ఉండకూడదనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. 'అడవితల్లి బాట 2.0'లో భాగంగా రూ.2,052 కోట్లతో 1,341 గిరిజన ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రహదారి సౌకర్యం కల్పిస్తే గిరిజన విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లడం, ప్రజలకు వైద్య సేవలు పొందడం, రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లకు తీసుకెళ్లడం సులభమవుతుందని వివరించారు. అల్లూరి సీతారామరాజు తనకు స్ఫూర్తి అని, గిరిజనుల సంక్షేమం కోసం పనిచేయడం బాధ్యతగా భావిస్తున్నానని పవన్ కల్యాణ్ అన్నారు. రాకోట ప్రాంతంలో వెదురుతో వస్తువులు తయారు చేసే గిరిజనులకు మార్కెట్ సదుపాయం కల్పించేం దుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ప్రస్తుతం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని పేర్కొన్న పవన్ కల్యాణ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## సిరిసిల్లలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టండి!

**హైదరాబాద్,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాలేదని కేటీఆర్ పేర్కొన్నారు. మండేపల్లి గ్రామంలో కళాశాల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు మొదలుకాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత ప్రాంగణం నుంచి కళాశాలను మరో ప్రైవేటు భవనానికి తరలించాలనే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తరగతులు, విద్యా కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేసి, పనులను వేగవంతం చేయాలని కేటీఆర్ కోరారు. కొత్త క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించాలని కోరారు.

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం..

# యాసంగి సాగు వద్దు!

- రైతులకు మంత్రి పొంగులేటి సూచన
- సాగునీటితోపాటు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం
- నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

**హైదరాబాద్,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉందని, దీంతో సాగునీటితోపాటు తాగునీటి అవసరాలను తీర్చడం సవాలుగా మారవచ్చని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఈ యాసంగిలో పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని కోరారు. వ్యవసాయ అవసరాలతోపాటు ప్రజల తాగునీటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగంలోనూ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన మేరకే విద్యుత్‌ను ఉపయోగించాలని పొంగులేటి సూచించారు. భవిష్యత్తులో నీటి కొరతతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం సూచించే మార్గదర్శకాలను రైతులు, ప్రజలు పాటించాలని కోరారు.

## జిబూటీలో ఘోర పడవ ప్రమాదం..139 మంది మృతి

### - మరో 116 మంది గల్లంతు.. మృతుల్లో 15 మంది చిన్నారులు

**జిబూటీ, (ప్రజావినికిడి): అక్టోబర్ 11:** తూర్పు ఆఫ్రికా దేశమైన జిబూటీ తీరంలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. వలసదారులతో యెమెన్‌కు వెళ్తున్న పడవ బోల్తాపడటంతో 139 మంది మరణించగా, మరో 116 మంది గల్లంతయ్యారు. ఈ విషయాన్ని అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) వెల్లడించింది. ఈ నెల 8న సుమారు 350 మందితో బయలుదేరిన పడవ, ఒబాక్ పట్టణానికి ఉత్తరాన గుహెరా సమీపంలో ప్రమాదానికి గురైంది. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం. గల్లంతైన వారి కోసం జిబూటీ అధికారులు, ఐఓఎం సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. బాధితులకు వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తున్నారు. ఆఫ్రికా దేశాల నుంచి గల్ఫ్ ప్రాంతాలకు వెళ్లే వలసదారులు ఈ ప్రమాదకర సముద్ర మార్గాన్ని వినియోగిస్తుంటారు. ఉపాధి, మెరుగైన జీవితం కోసం చేపడుతున్న ప్రయాణాలు ప్రాణాంతకంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వలసదారుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

## సీఎం విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

పూందమల్లి బైపాస్ స్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో రూ.13 వేల కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు చేశారు. పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. చెన్నై మెట్రో రెండో దశలోని కొత్త మార్గం నగరంలోని పలు ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచనుంది. ఈ మార్గంలో ప్రత్యేకంగా 3.7 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ నిర్మాణం ఉంది. రోడ్డు రవాణా, రైల్వేలు సహా వివిధ రంగాలకు చెందిన ప్రాజెక్టులు తమిళనాడు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడతాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మెట్రో ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి విజయ్ కలిసి రైలులో ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ు

# సుప్రీంకోర్టుకు మార్చ్‌గా తరలిరండి!

**న్యూఢిల్లీ,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** యువతపై పోలీసులు, బీజేపీకి చెందిన వ్యక్తులు దాడులు చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సంఘాలు, ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్నవారంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో శనివారం శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై దాడులు జరిగాయని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఓట్ల చోరీ ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు. పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాలని రాహుల్‌గాంధీ కోరారు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, పరిశీలకులు, ముఖ్య నేతలతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. 2024 ఎన్నికల కంటే ఎక్కువ ఓట్ల శాతం సాధించేలా కృషి చేయాలని, నేతల పనితీరును సమీక్షించి రేటింగ్‌లు ఇస్తామని చంద్రబాబు తెలిపారు. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం క్షేత్రస్థాయి వరకు ఉండాలని, ఉమ్మడిగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాబోయే 50 రోజులు ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేయాలని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం మేర పార్టీ టికెట్లు కేటాయించే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు. 'జయహో బీసీ! జనాభాలో సగంకూటమి ఇచ్చింది బలం' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేపట్టాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని నేతలకు చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిస్తే రాష్ట్రంలో 'ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పడుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కూటమి సమన్వయ కమిటీలను క్రియాశీలం చేయాలని, ప్రత్యర్థి పార్టీల విమర్శలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

## బారికేడ్లు తొలగించండి.. మెట్రోను నడపండి!

(మొదటి పేజీ తరువాయి)

ఆంక్షలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే వారిని అక్రమంగా నిర్బంధించరాదని, చట్టప్రకారం మాత్రమే చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు, ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలకు అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. శాంతిభద్రతలను కాపాడే పేరుతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని సూచించింది. ఇంటర్నెట్ సేవలకు అనవసరంగా అంతరాయం కలగకుండా చూడాలని కూడా ఆదేశించింది. మెట్రో, రైల్వే స్టేషన్ల మూసివేతతో ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. భద్రతా కారణాలతో అవసరమైన పరిమితులు విధించవచ్చని, అయితే ప్రజా రవాణా పూర్తిగా నిలిచిపోయేలా చర్యలు ఉండకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రజల ప్రయాణ స్వేచ్ఛను కాపాడుతూ, చట్టబద్ధమైన పరిమితుల పరిధిలో శాంతిభద్రతలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు సూచించింది.

## భారత్ - జపాన్ స్నేహబంధం చిరకాలం!

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సాంకేతికత, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, విద్య, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాల్లో భారత్, జపాన్ సంబంధాలు గణనీయంగా అభివృద్ధి చెందాయని చెప్పారు. హైదరాబాద్ సమాచార సాంకేతికత, ఔషధాలు, జీవసాంకేతికత, పారిశ్రామిక అభివృద్ధి రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జపాన్‌లోని హిరోషిమా ప్రాంతంతో పెట్టుబడులు, ఆధునిక తయారీ, సాంకేతికత, నూతన ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకునేందుకు అవకాశాలు ఉన్నాయని స్పీకర్ పేర్కొన్నారు. హిరోషిమా శాంతి, స్థిరత్వం, మానవ సంకల్పానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. భారత్, జపాన్ మధ్య ఇప్పటికే ఉన్న స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని, ప్రజల మధ్య పరస్పర సంబంధాలు పెంపొందించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇరు దేశాల సహకారం ద్వారా పారిశ్రామిక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు.

# నాలుగైదు రోజుల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన!

- ఆశావహుల జాబితా అధిష్ఠానానికి పంపించాం: రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్,(ప్రజావినికిడి): అక్టోబర్ 11:** తెలంగాణలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నాలుగైదు రోజుల్లో బీజేపీ అభ్యర్థులను ప్రకటిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులుగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల పేర్లను ఇప్పటికే పార్టీ అధిష్ఠానానికి పంపించామని వెల్లడించారు. తుది నిర్ణయం అధిష్ఠానమే తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయాలా? వద్దా? అనే అంశంపై కూడా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని రాంచందర్‌రావు పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అంతకుముందు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఇప్పటికే కాంగ్రెస్ తన అభ్యర్థులను ప్రకటించగా, బీఆర్ఎస్ కూడా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 12 అక్టోబర్ 2026

# రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్ట్ వద్ద 60, కుత్బుల్లాపూర్ లో 96 మద్యం బాటిల్ లు పట్టివేత..



**శంషాబాద్, కుత్బుల్లాపూర్, (ప్రజా వినికిడి):** ఎన్ ఫోర్స్ మెంట్ హైదరాబాద్ టీం, డిటిఎఫ్ టీం, రాజేంద్రనగర్, మీర్పేట్ ఎక్సైజ్ స్టేషన్లో సిబ్బంది కలిసి బెంగళూరు హైవే రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్ట్ సమీపంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 60 మద్యం బాటిల్లు పట్టుబడినట్లు పేర్కొన్నారు. మద్యం బాటిల్లను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఈ ఎస్ ప్రవీణ్ తెలిపారు.



కుత్బుల్లాపూర్ లో

**96 క్వార్టర్ బాటిల్ పట్టివేత..**

డిటిఎఫ్ కుత్బుల్లాపూర్ మాదాపూర్ ఎక్సైజ్ స్టేషన్స్ సిబ్బంది కలిసి నిర్వహిస్తున్న తనిఖీల్లో ఒక కారులో కే.శంకర్ అనే వ్యక్తి 96 క్వార్టర్ బాటిల్ లను తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నారు. మద్యం బాటిల్లతో పాటు రూ.6వేల నగదు,కారును సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సూపర్డెంట్ ఎస్ ఆర్ ప్రవీణ్ తెలిపారు. మద్యం బాటిలను మాదాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

# పార్టీ మార్పుల ప్రచారంలో వాస్తవం లేదు!

## పార్టీని వీడే వారికే నష్టం: బీజేవైఎం నేత సంగెం శివకుమార్



**కొత్తూరు, (ప్రజావినికిడి): అక్టోబర్ 11,** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో కొందరు బీజేపీ కార్యకర్తలు పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీజేవైఎం కొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి సంగెం శివకుమార్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా విస్తృతమైన రాజకీయ బలాన్ని కలిగి ఉందని, కేంద్రంలో అధికారంలో కొనసాగుతోందని పేర్కొన్నారు. క్రమశిక్షణ,పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయడం బీజేపీ ప్రత్యేకత అని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించి కొందరు ఇతర పార్టీల వైపు వెళ్లినా, అలాంటి పరిణామాలతో పార్టీకి నష్టం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.పార్టీని వీడే కార్యకర్తలే నష్టపోతారని వ్యాఖ్యానించారుబీజేపీ కార్యకర్తలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. దేశాభివృద్ధి, హిందూ ధర్మ పరిరక్షణ లక్ష్యాలతో బీజేపీ ముందుకు సాగుతోందని సంగెం శివకుమార్ పేర్కొన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఇండిగో విమానంలో పొగలు..

## శంషాబాద్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్

## పవర్ బ్యాంక్ నుంచి దట్టమైన పొగలు.. ప్రయాణికుల్లో భయాందోళనలు






**శంషాబాద్, (ప్రజావినికిడి):**ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానంలో పవర్ బ్యాంక్ నుంచి అకస్మాత్తుగా దట్టమైన పొగలు వెలువడటంతో కలకలం రేగింది. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన క్యాబిన్ సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురాగా, పైలట్ విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. అక్కడ విమానాన్ని అత్యవసరంగా సురక్షితంగా ల్యాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అక్టోబర్ 11, ఆదివారం ఢిల్లీ నుంచి చెన్నై బయలుదేరిన ఇండిగో విమానంలో ప్రయాణిస్తుండగా ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి ఒక్కసారిగా పొగలు వెలువడ్డాయి. దీంతో విమానం క్యాబిన్‌లో పొగ వ్యాపించి ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. వెంటనే అప్రమత్తమైన క్యాబిన్ సిబ్బంది పొగల తీవ్రతను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు.పరిస్థితిని గమనించిన పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులను సంప్రదించి, విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. అనంతరం విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, పవర్ బ్యాంక్ నుంచి పొగలు వెలువడటానికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# వెంకట సుబ్బారావుకు గేమ్ చేంజర్ అవార్డు..




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఫౌండర్ సచ్చివోలు రాంబాబు ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి గేమ్ చేంజర్ అవార్డ్స్ 2026 ను ఎల్ వి ప్రసాద్ ఆడిటోరియంలో జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా ప్రైమ్ 9 న్యూస్ ఛానల్ చైర్మన్ బండి శ్రీనివాస రఘువీర్ రిటైర్డ్ ఐపీఎస్ సురేందర్ రెడ్డి ప్రముఖ నిర్మాత దర్శకులు నాగబాల సురేష్ కుమార్ అతిథులుగా హాజరైన కార్యక్రమంలో ప్రకటించడం అయినది.సామాజిక సేవ విభాగంలో కంతేటి వెంకట సుబ్బారావుకు గేమ్ చేంజర్ అవార్డు తో సత్కరించడం జరిగింది.

# చౌదరిగూడ శ్రీనివాస కాలనీ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తా

## : కాలనీ నూతన అధ్యక్షుడు గంగిడి మహిపాల్ రెడ్డి





**ఘట్కేసర్,(ప్రజావినికిడి):** శ్రీనివాస కాలనీ ప్రజల సంక్షేమం, ఐక్యత,అభివృద్ధి కోసం అందరితో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీ నూతన అధ్యక్షుడు గంగిడి మహిపాల్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం చౌదరిగూడ శ్రీనివాస కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యావర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు . ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీలోని ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకొని, సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ, కాలనీ అభివృద్ధికి అవసరమైన పనులను విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కాలనీలో చిన్నా, పెద్దా,మహిళలు, యువత అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.కాలనీ నూతన కార్యవర్గం లో భాగంగా ఉపాధ్యక్షుడిగా జితేందర్ సింగ్ రానా,కార్యదర్శి గా ఎం. రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ గా కె.సుమన్, కోశాధికారి గా జి. మనోహర్, సలహాదారులు గా జి.అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా బి. రంజిత్ కుమార్, డి.నర్సింగ్ రావు లు ఎన్నికయ్యారు.

# అమ్మ నామస్మరణతో ఆధ్యాత్మిక శోభ..

## బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం.. - ప్రత్యేక పూజలు పాల్గొన్న కోరని శ్యామ్ దంపతులు



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 11:** జీహెచ్ఎంసీ బుద్వేల్ సర్కిల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఉన్న శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు తాళ్లపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరని శ్యామ్ దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం నిర్వహించడంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ నేతల సమాలోచనలు.!

**డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డితో సామ రామ్మోహన్ రెడ్డి భేటీ**

**ఎమ్మెల్సీ ఎన్నికలు,పార్టీ బలోపేతంపై కీలక చర్చలు**

**రంగారెడ్డి, (ప్రజావినికిడి): అక్టోబర్11,** ఉమ్మడి మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ భేటీ సందర్భంగా రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం,పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ఎన్నికల సన్నద్ధత, గ్రాడ్యుయేట్ ఓటర్లను చేరుకునే అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో పార్టీకి మరింత బలాన్ని చేకూర్చే దిశగా నాయకులంతా సమష్టిగా కృషి చేయాల్సిన అవసరంపై అభిప్రాయాలు పంచుకున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు ఎన్నికల్లో విజయావకాశాలను మెరుగుపరుచుకునేందుకు నాయకులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఈ భేటీలో ప్రాధాన్యతనిచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్య నాయకుల మధ్య జరుగుతున్న ఇలాంటి సమావేశాలు పార్టీ శ్రేణుల్లో సమన్వయాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.





# షాద్ నగర్ పట్టణంలోని ఏబీ విల్లాస్ దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు ఏబీ విల్లాస్ లో కొలువుదీరిన దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నవరాత్రి పండుగ పురస్కరించుకొని కాలనీలో ఏర్పాటు చేసిన దేవి శరణనవరాత్రి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక హారతులు,నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమన్నారు.దుర్గాదేవి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని,ప్రతి ఇంటా సుఖసంతోషాలు నిండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నేత అందె బాబాయ్య, కౌన్సిలర్ అనితరఘునాథ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కానుగు అనంతయ్య, సీనియర్ నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచులు మరియు మాజీ ఎంపిటిసిలు చక్కటి వెంకటేష్ యాదవ్,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,కాట్నా రవీందర్,అశోక్ రెడ్డి,ఉమా ప్రవీణ్ రెడ్డి,నాయకులు జ్ఞానేశ్వర్,మనోహర్ రెడ్డి,శేఖర్ రెడ్డి,అందె రాజేందర్,శివ చారి,అన్వారీ రాజు,మహిపాల్ గౌడ్,శివ తదితరులు పాల్గొన్నారు

# కాటేదాన్‌లో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు..

**పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్న యువకులు..**

**బాబుల్ రెడ్డి నగర్,మోహన్ రెడ్డి నగర్, శ్రీరామ్ నగర్ బస్తీల నుంచి చేరిక**



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్11,**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన యువకులు, కార్యకర్తలు చేరారు. ఆదివారం బాబుల్ రెడ్డి నగర్,మోహన్ రెడ్డి నగర్, శ్రీరామ్ నగర్ బస్తీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నూతన నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశంలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ప్రశ్నిస్తున్న తీరు తమను ఆకట్టుకుందని తెలిపారు. ముఖ్యంగా భూ సేకరణ పేరుతో పేదల భూములకు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్న సమయంలో బాధితులకు అండగా నిలుస్తూ,వారి పక్షాన పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కార్తీక్ రెడ్డి చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్ ముదిరాజ్, మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, రాము యాదవ్, మైసిరెడ్డి,అక్కెం రఘు యాదవ్, కార్మిక విభాగం అధ్యక్షుడు ఉప్పల్ శ్రీను, రాజేష్ యాదవ్, రామస్వామి, మోహన్, ఆనంద్,భాస్కర్ నేత,మల్లేష్



నేత తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో సురేష్ ముదిరాజ్ బృందం,సాజిద్ బృందం, సయ్యద్ బృందం,కార్తీక్ బృందం,వినయ్ కుమార్ బృందానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# శంషాబాద్ బస్తీల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రంగురంగుల పూలతో బతుకమ్మలు.. - మహిళల ఆటపాటలతో పండుగ సందడి**



**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 11,** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు శంషాబాద్ జోన్ కేంద్రంలో శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ బస్తీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళలు ఆలపించిన జానపద గీతాలతో ఆయా బస్తీల్లో పండుగ వాతావరణం నెలకొంది. శంషాబాద్‌లోని మధురానగర్, ఆర్బీనగర్,హెచ్. బృందావనం, జెండా చౌరస్తా, అంగడిబజార్, సిద్ధాంతి, సాతంరాయి తదితర బస్తీల్లో మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన బతుకమ్మలను పేర్చారు. తంగేడు, గునుగు,బంతి తదితర పూలతో సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలను అలంకరించి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరితో ఒకరు కలిసి చప్పట్లు కొడుతూ ఆడిపాడడంతో బస్తీలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సంప్రదాయ జానపద గీతాలను ఆలపిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మహిళలు పాడిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి బస్తీలోనూ మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో పండుగ సందడి నెలకొంది. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మహిళలు తమ సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకతను ఈ వేడుకలు చాటిచెప్పాయి. శంషాబాద్‌లోని వివిధ బస్తీల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మహిళల ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.

# కుటుంబ సభ్యులతో కలిసి కాశీ విశ్వనాథ స్వామివారి దర్శనం

**మంగళ,గంగా హారతిలలో జ్యోతి ప్రజ్వలన,హోమంలో పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర కాశీ క్షేత్రంలో శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారిని దర్శించుకుని, స్వామివారి మంగళ హారతి సేవలో పాల్గొని ఆశీస్సులు పొందారు. అనంతరం కాశీలోని హస్సీ ఘాట్‌లో ఉదయం నిర్వహించిన గంగా హారతి కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. పవిత్ర గంగానది తీరాన భక్తిశ్రద్ధలతో నిర్వహించిన, ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం విశేషమైన అనుభూతిని అందించింది. భారతీయ సంస్కృతి,సనాతన ధర్మ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే కాశీ క్షేత్రంలో గంగమ్మకు నిర్వహించే హారతి కార్యక్రమం ఎంతో విశిష్టమైనది. గంగానది పవిత్రతను,ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పే ఇటువంటి కార్యక్రమాలు భారతీయ ఆధ్యాత్మిక వారసత్వ గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ సందర్భంగా లోక కల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# షాద్‌నగర్ నూతన ట్రాఫిక్ సీఐగా ఎస్. వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ




**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
పట్టణ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రాకపోకలు,ట్రాఫిక్ రద్దీ,రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాల నేపథ్యంలో ట్రాఫిక్ విభాగం కీలకంగా మారింది. ఈ క్రమంలో ఆయన బాధ్యతల స్వీకరణ ప్రాధాన్యత సంతరించుకుంది. షాద్‌నగర్ పట్టణంలో ప్రధాన రహదారులు, కూడళ్లు,వ్యాపార సముదాయాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం ప్రధాన సవాలుగా నిలుస్తోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీని నియంత్రించడం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ట్రాఫిక్ నిబంధనల అమలును పర్యవేక్షించడం,వాహనదారులు నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టడం ట్రాఫిక్ పోలీసుల విధుల్లో కీలకమైనవి. హెల్మెట్ ధరించడం,సీట్‌బెల్ట్ వినియోగించడం,అతివేగాన్ని నియంత్రించడం,మద్యం సేవించి వాహనాలు నడపకుండా చూడటం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ప్రమాదాల నివారణకు కృషి చేయవచ్చు. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం,రహదారులపై వాహనాల నిలుపుదల వల్ల ఏర్పడే ఇబ్బందులను తగ్గించడం,పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎస్.వెంకటేశ్వర్లు నేతృత్వంలో షాద్‌నగర్ పట్టణ ట్రాఫిక్ నిర్వహణ మరింత మెరుగుపడుతుందని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.

# వాచ్య తండాలో శివ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**పాల్గొన్న జిల్లేడు చౌదరిగుడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్**



**జిల్లేడు చౌదరిగూడ,(ప్రజావినికిడి):**
పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండలం వాచ్యా తండాలో శివ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై,ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ,సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంఎంతోతోడ్పాటునందిస్తోందన్నారు. పేదలఆత్మగౌరవ ానికి,కుటుంబ భద్రతకు సొంత ఇల్లు ఎంతోముఖ్యమని పేర్కొన్నారు. నూతన గృహంలో శివ దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు,సర్పంచ్ నీలయ్య,సత్యం,బంధ్యయ్య, కుమార్,వైస్ చైర్మన్ గోబ్ర్య నాయక్,పీఏసీఎస్ డైరెక్టర్లు జక్కని రవికుమార్, మల్లేష్,ఎంపీపీ తనయుడు ఆంజనేయులు,మాజీ ఎంపీటీసీ సత్యం రెడ్డి,మాజీ సర్పంచులు బాలరాజ్, సలీం,యాదయ్యమార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటనరసింహ రెడ్డి,మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకట్రాములు, పాపయ్య, రాజేష్,భూమగళ్ల శ్రీను,మంగ్యా నాయక్ తదితర కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా హోమ గుండం ప్రారంభం..

**హోమ గుండాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
దేవినవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని పెద్ద జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలోని,శివాలయంలో దుర్గదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో హోమ గుండాన్ని వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభించిన టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చారిత్రక అలాగే ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని దుర్గామాత క్షేత్రాన్ని దేవి నవరాత్రుల వేళ దర్శించుకుని,హోమ గుండాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషకరమని,ఆ జగన్మాత దుర్గదేవి కరుణాకటాక్షాలతో ప్రజలందరికీ అంతా మంచి జరగాలని,ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నిండాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు శ్రీనివాసచార్యుల బృందం,ఒగ్గు కిషోర్,రాంభూపాల్,డంగు శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ చింటూ,గంధం ఆనంద్, యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో భారీగా చేరికలు





**కొత్తూరు, (ప్రజావినికిడి):**
కాంగ్రెస్,బీజేపీ విధానాలు నచ్చక ఆ పార్టీ శ్రేణులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పెంజర్ల మాజీ సర్పంచ్ వనం బాలరాజ్,బ్యాగరి రాజు,కుమ్మరి పోచయ్య,వన్నం బీరయ్య,మల్లేష్, దస్తగిరి ఆధ్వర్యంలో కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పాముల రమేష్,వన్నం రవితో పాటు 54 మందికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీకి కార్యకర్తల బలమని, మాజీ ఉపసర్పంచ్ పాముల రమేష్ పార్టీలోకి రావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఉపసర్పంచ్ పాముల రమేష్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి పనులకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. పార్టీలో చేరిన వారి పేర్లు పాముల రమేష్, పాముల శేఖర్,పాములమధవులు, పాముల మహేష్,పాముల కృష్ణ,పాముల మురళి,పాముల కృష్ణ, పాముల శివ, కందినవనం నవీన్ కుమార్, కందివనం సత్తయ్య, పి చంద్రయ్య, పి. శ్రీధర్,పి. సత్యనారాయణ, పాముల శ్రవణ్,పాముల రాజు,పాముల శివ,పాముల గోపాల్,పాముల భాస్కర్,పాముల వీరేష్, మోకర్ల శివ,మోకర్ల బాలరాజు,మోకర్ల రాకేష్,రాయికల్ శంకర్, పాముల రవి,కందివనం శివశంకర్, కందివనం నందు,వన్నం రవి,వన్నం బాలరాజ్,వన్నం వీరేందర్, వన్నం మహేష్,వన్నం విష్ణు, వన్నం మహేందర్,వన్నం నాగార్జున, వన్నం శ్రీధర్, దేవరి వినయ్, దేవరి అజయ్,వి మహేష్,కోట నవీన్,కోట ప్రవీణ్,కోట శ్రీకాంత్,కోట నవీన్,కోట చింటూ,గడ్డమీది మల్లేష్,వన్నం శ్రీను,వన్నం కుమార్,అశోక్,బ్యాగర్ జశ్వంత్,తెలుగు పవన్,కావాలి సందీప్,పలుగుట్ట అక్షిత,విజయ్ కుమార్,కావాలి నారాయణ,ఎండీ పాషా, తదితరులు గులాబీ కండువా కప్పుకున్నారు.

# ఎల్లికట్ట భవానీ మాత ఆలయంలో
# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
దేవి శరన్నవరాత్రిఉత్సవాల సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లికట్ట గ్రామంలో కొలువై ఉన్న ప్రసిద్ధ శ్రీ అంబా భవానీ మాత ఆలయాన్ని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారుశరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో వెలిసిన దేవికి ఆయన ప్రత్యేక అభిషేకం,పూజలు,అర్చనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,
చారిత్రక అలాగే ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన ఎల్లికట్ట భవానీ మాత క్షేత్రాన్ని దేవి నవరాత్రుల వేళ దర్శించుకోవడం ఎంతో సంతోషకరమని,ఆ జగన్మాత భవానీ దేవి కరుణాకటాక్షాలతో ప్రజలందరికీ అంతా మంచి జరగాలని,ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నిండాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి పోటెత్తుతున్న భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎల్లికట్ట సర్పంచ్ వాకిటి నవకిరని నరసింహ,మాజీ సర్పంచ్ సాయి యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, పాలమకుల చెన్నయ్య,మాజీ సర్పంచ్ ఉమా ప్రవీణ్ రెడ్డి,అప్పరెడ్డి గూడ మాజీ సర్పంచ్ జెకే నర్సింహా,వెల్జర్ల మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి,ఆలయ చైర్మన్ చంద్రయ్య,మాజీ చైర్మన్లు కమిటీ సభ్యులు, నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న
# షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని కొత్తూరు మండల కేంద్రంలో మహిమ కలిగిన బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల కట్ట వద్ద శ్రీశ్రీశ్రీ హరిబాలానంద దాసు ఆధ్వర్యంలో నిర్వహించిన బంగారు మైసమ్మ,జంట నాగులు,పోతరాజు,బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొత్తూరులో కొలువుదీరిన బంగారు మైసమ్మ తల్లి మహిమ అపారమని,ఆ తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని అన్నారు.ప్రకృతి అనుకూలించి సకాలంలో వర్షాలు కురవాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని,ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్పార్టీ నాయకులు,యువకులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

**: బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో ఇటీవల జరిగిన కార్మిక సంఘాల ఎన్నికల్లో జీడిమెట్ల డిపో నుంచి బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ - ఈఎంయూ - ఎన్ఎంయూ కూటమి ప్రత్యర్థి కూటమి అయినా ఈడబ్ల్యూయూ - టిడబ్ల్యూయూ - ఐఎన్టియుసి కూటమిపై 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా జలిగం రాకేష్ అధ్యక్షులుగా గెలిచారు.ఈ సందర్భంగా ఉదయం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద జీడిమెట్ల డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్ - ఈఎంయూ - ఎన్ఎంయూ కూటమి సభ్యులు గౌరవాధ్యక్షులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ,కార్మిక సంఘాల ఎన్నికలలో గెలుపు కార్మికుల సంక్షేమం పట్ల నూతన కమిటీ సభ్యులపై మరింత బాధ్యతను పెంచుతుందని, కార్మిక సంక్షేమం విషయంలో నూతన కమిటీకి నావంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికైన జలిగం రాకేష్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ కోల రాజేష్,గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రాపోలు,బాబు, అధ్యక్షులు జ్ఞానేశ్వర్,జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి,సభ్యులు పాషా,అంకం రావు, బిఎల్.నారాయణ,మహిళా నాయకురాలు క్రిష్ణా భాయ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్రా యాత్రలో విషాదం

## రియాద్ ఎయిర్‌పోర్ట్ దాడిలో హైదరాబాద్ వాసి మృతి..

**మెహదీపట్నంకు చెందిన మొహమ్మద్ యూసుఫ్ అలీ ప్రాణాలు కోల్పోయినట్టు గుర్తింపు**

**ఉమ్రా యాత్ర కోసం వెళ్లగా ఘటన.. ఆయన ఇద్దరు కుమారులు, అత్తకు గాయాలు**

**మృతుడి కుటుంబానికి సాయం చేయాలని కేంద్రమంత్రిని కోరిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ**

**హైదరాబాద్ (ప్రజావినికిడి):**



సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మృతి చెందారు. నగరంలోని మెహదీపట్నం నివాసి మొహమ్మద్ యూసుఫ్ అలీ ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఉమ్రా యాత్ర కోసం కుటుంబ సమేతంగా వెళ్లిన క్రమంలో ఈ విషాదం చోటుచేసుకుంది.శనివారం జరిగిన ఈ దాడిలో యూసుఫ్ అలీ తీవ్రంగా గాయపడగా, రియాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో ఆయన ఇద్దరు కుమారులు, అత్త కూడా గాయాలపాలయ్యారు. ఒక కుమారుడికి మోకాలి శస్త్రచికిత్స జరగ్గా, మరో కుమారుడు కాలి వేళ్లను కోల్పోయినట్లు సమాచారం. అత్త తలకు గాయాలైనప్పటికీ ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. యూసుఫ్ అలీ భార్య, కుమార్తె క్షేమంగా ఉన్నట్లు తెలిసింది. వీరంతా మదీనా వెళ్లేందుకు చెక్-ఇన్ కియోస్క్ వద్ద వేచి ఉన్న సమయంలో ఈ దాడి చోటుచేసుకుంది.ఈ ఘటనను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించారు. బాధిత కుటుంబంతో తాను సంప్రదింపుల్లో ఉన్నానని, వారికి తక్షణమే సహాయం అందించాలని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్‌ను ఆయన కోరారు. దీనిపై స్పందించిన మంత్రి జైశంకర్, మృతుడి కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ, అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. యూసుఫ్ అలీ భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించేందుకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం తగిన ఏర్పాట్లు చేస్తోంది.హౌతీ మిలిటెంట్లు జరిపిన ఈ దాడిలో మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 11 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో సౌదీ అరేబియాలో ఉన్న భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది.

# మూసీ సుందరీకరణ పేరుతో అదనపు భూసేకరణ వద్దు..

**బఫర్ జోన్ వరకే భూముల సేకరణ పరిమితం చేయాలి.. - మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..**

**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 11,**
మూసీ సుందరీకరణ పేరుతో బఫర్ జోన్ పరిధిని దాటి అదనంగా భూములు సేకరించే ప్రతిపాదనను విరమించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆదివారం ఉదయం ఆయన అధికారిక నివాసంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కలిసి సమస్యను వివరించారు. బండ్లగూడ జాగీర్‌లోని దర్గా కాలేజ్ ప్రాంతానికి చెందిన భూబాధితులు సైతం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంత్రిని కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని,అయితే బఫర్ జోన్ పరిధిని దాటి సుమారు 500 మీటర్ల వరకు భూములను సేకరించాలనే ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బఫర్ జోన్ పరిధిలో అవసరమైన భూములను మాత్రమే సేకరించాలని, అదనపు భూసేకరణతో స్థానికులు తమ నివాసాలు, ఆస్తులు కోల్పోయే పరిస్థితి రాకుండా చూడాలని కోరారు.ఇతర అభివృద్ధి పనులు లేదా హోటళ్ల నిర్మాణాల కోసం స్థానికుల భూములను సేకరించాలనే ఆలోచనను



విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**స్థానిక ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.**
ప్రభుత్వం ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు స్థానిక ఎమ్మెల్యేలు, సంబంధిత మంత్రుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు. భూసేకరణతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,వారి భూములు కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. బాధితుల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# సుచిత్ర-మేడ్చల్ ఫ్లైఓవర్లకు పిండప్రదానం చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుంట సిద్ధిరాములు మేడ్చల్ మెట్రో సాధన సమితి

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అతి పెద్ద నేషనల్ హైవే పెద్ద ఎత్తున ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టాలని శాసన సభ్యులు కెపి వివేకనంద్ ఈ విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ మాజి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రి గా ఉన్నపుడు ఈ ప్రాంత ఎమ్మెల్యే కేపి వివేక నంద ట్రాఫిక్ సమస్య కేటీ రామారావు దృష్టికి తీసుకు వెళ్ళారు వెంటనే కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మంజూరు చేయించి సుచిత్ర లో శంకుస్థాపన చేశారు.శ్రీనివాస ఇన్ఫ్రా కన్స్ట్రక్షన్ సంస్థ వారు సుచిత్ర మేడ్చల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో భాగంగా పిల్లర్లను లేపిన సమయం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు పనులు పూర్తి చేయకపోవడం తో పడకేసిన రోడ్డు విస్తరణ పనులు.దాదాపు మూడు సంవత్సరాలు గా అసంపూర్తి గానే నిర్మాణాలు.. పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనాలు.. పనులు ప్రారంభించే వరకు పోరాటం ఆగదు మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన సుచిత్ర-మేడ్చల్ ఫ్లైఓవర్ పనులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో సుచిత్ర సర్కిల్‌లో ఫ్లైఓవర్లకు ప్రతీకాత్మకంగా పిండప్రదానం కార్యక్రమం నిర్వహించారు.
గత రెండేళ్లుగా మేడ్చల్ మెట్రో సాధన సమితి అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ,ఫ్లైఓవర్ పనుల పునఃప్రారంభంపై ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని సమితి ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఫ్లైఓవర్ల నిర్మాణం నిలిచిపోవడంతో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ,కాలుష్యం, రోడ్డు ప్రమాదాల ముప్పును ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల విలువైన సమయం వృథా అవుతుండటమే




కాకుండా, ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ,సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులను తక్షణమే పునఃప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరింది.ఫ్లైఓవర్ నిర్మాణం పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి,ఎప్పటిలోగా పూర్తవుతాయి అనే విషయాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది.అలాగే, హైదరాబాద్ అభివృద్ధికి అత్యంత కీలకమైన మెట్రో రైలు రెండో దశకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలపాలని కోరింది.ఉత్తర హైదరాబాద్‌లోని మేడ్చల్, షామీర్‌పేట్ తదితర ప్రాంతాలకు మెరుగైన మెట్రో కనెక్టివిటీ కల్పించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలను తగ్గించి,ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు అందించాలని పేర్కొంది.ప్రజా సమస్యలపై మా పోరాటం ఆగదు. వినతులు ఇచ్చాం, అధికారులను కలిశాం,ప్రజల తరఫున ఎన్నో ప్రయత్నాలు చేశాం.ఇకనైనా పాలకులు స్పందించి పనులు ప్రారంభించాలి. ప్రజల సహనాన్ని చేతగానితనంగా భావించవద్దు. ఫ్లైఓవర్లు పూర్తయ్యే వరకు, మెట్రో రెండో దశకు ఆమోదం లభించే వరకు మా ఉద్యమం కొనసాగుతుంది.అని మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంపత్ రెడ్డి, మహేందర్ రెడ్డి జార్జ్,మోహన్ రెడ్డి,దేవేందర్ రెడ్డి కుంట ,సిద్ధి రాములు, శ్రీనివాస్ రెడ్డి, సంధ్య,రాజేశ్వర్, లక్ష్మారెడ్డి,నరేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

# ఇక ప్రైమరీ స్కూళ్లలోనూ 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్' యూనిట్లు



**హైదరాబాద్ :**విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణను పెంపొందించే లక్ష్యంతో విద్యాశాఖ ఓ కొత్త ప్రణాళికతో ముందుకొచ్చింది. రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్' యూనిట్లను ప్రవేశపెడుతోంది. గతంలో కేవలం ఉన్నత పాఠశాలలకే పరిమితమైన ఈ కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి చిన్న వయస్సు విద్యార్థులకు కూడా విస్తరిస్తున్నారు.ఈ ఏడాది మొత్తం 3,253 పాఠశాలల్లో బీఎస్?జీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 79 ప్రాథమిక పాఠశాలలు, 26 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ఇటీవల సమగ్ర శిక్ష, పీఎంశ్రీ పథకాల కింద రూ.22.27 కోట్లను మంజూరు చేసింది.విద్యార్థులకు యూనిఫాం, బూట్లుప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఉపాధ్యాయులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగిస్తారు. అలాగే యూనిఫాంలు, బూట్లు సమకూర్చడంతో పాటు ఇతర అవసరాలను తీర్చడానికి వినియోగిస్తారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. ఆసక్తి గల విద్యార్థులను ఈ నెలాఖరులోగా గుర్తించి వారి యూనిఫాం, బూట్ల కొలతల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారులకు సమర్పించాలని విద్యాశాఖ ఉపాధ్యాయులను ఆదేశించింది.గత విద్యా సంవత్సరంలో 824 ప్రభుత్వ పాఠశాలల్లో బీఎస్?జీ యూనిట్లు కొత్తగా ప్రవేశపెట్టారు. 2026-27 సంవత్సరానికి గానూ మరో 1,200 ప్రభుత్వ పాఠశాలల్లో వీటిని ప్రవేశపెట్టాలని మొదట లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 3,253 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి అనుమతినిచ్చింది.వీటిలో రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో బీఎస్?జీ యూనిట్లు ప్రారంభం కానున్నాయి. ప్రతి యూనిట్?లో 11 నుంచి 17 ఏళ్ల వయస్సు గలవారు మొత్తం 32 మంది విద్యార్థులు ఉంటారు. వీరిలో 16 మంది బాలురు, 16 మంది బాలికలు ఉంటారు. అలాగే కబ్స్, బుల్?బుల్? యూనిట్?లో 11 ఏళ్లలోపు పిల్లలఅలాగే కబ్స్, బుల్?బుల్? యూనిట్?లో 11 ఏళ్లలోపు పిల్లలు ు 24 మంది ఉంటారు. ఈ యూనిట్లలో చేరే మొత్తం విద్యార్థుల సంఖ్య లక్షకు చేరుకుంటుందని బీఎస్?జీ రాష్ట్ర కమిషనర్ నవీన్ నికోలస్ తెలిపారు.గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శనివారం బీఎస్?జీ కోసం రూపొందించిన కొత్త వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విభాగం కార్యదర్శి అయిన నవీన్ నికోలస్ రాష్ట్రంలోని సంస్థ కార్యకలాపాలు, పురోగతి గురించి గవర్నర్‌కు వివరించారు. గత ఏడాది 1,492 ప్రాంతాల్లో బీఎస్?జీ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 3,253 పాఠశాలల్లో కొత్త యూనిట్లను ప్రారంభిస్తున్నామని, దీనివల్ల ఇందులో పాల్గొనే విద్యార్థుల మొత్తం సంఖ్య 1.28 లక్షలకు చేరుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఛత్రపతి శివాజీని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీజేపీ: జగ్గారెడ్డి




**సంగారెడ్డి, అక్టోబర్11:**
ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఓ మతానికి పరిమితం చేయడం కరెక్ట్ కాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు. చరిత్రని వక్రీకరించి ఛత్రపతి శివాజీని రాజకీయ లబ్ధి కోసం బీజేపీ వాడుకుంటుందంటూ మండిపడ్డారు. ఆదివారం సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహా ఏర్పాటుకు ఆయన భూమి పూజ చేశారు.అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ వద్ద ముస్లిం అధికారులు కూడా పని చేశారని గుర్తు చేశారు. ఆయనకు కులం, మతంతో సంబంధం లేదని అన్నారు. రాజ్యంలోని ప్రజల బాగోగులు, రాజ్య భద్రతే శివాజీకి ముఖ్యమని స్పష్టం చేశారు. ఛత్రపతి గొప్ప వీరుడని.. ఆయన గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా యువతకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు.

# కరెంట్ కోతలను నిరసిస్తూ సబ్‌స్టేషన్ వద్ద రైతుల వంటవార్పు



**జడ్చర్ల :** విద్యుత్ కోతల వల్ల పంట పొలాలు ఎండిపోతున్నాయని నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలానికి చెందిన ఊర్కొండపేట, జాకినాలపల్లి రైతులు ఆదివారం జాకినాలపల్లి -- సబ్ స్టేషన్ వద్ద వంటవార్పు ) తో నిరసన తెలిపారు. ఊర్కొండపేట మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ , రైతులు మాట్లాడుతూ సాగు కోసం అప్పులు చేసి, పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు.అన్నదాతలకుపొలాలకు నీరు పెట్టాల్సిన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల తో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించే రైతన్నకు కనీసం సక్రమంగా విద్యుత్ సరఫరా కూడా అందడం లేదని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించడం ప్రభుత్వాల బాధ్యతని గుర్తు చేశారు. విద్యుత్ కోతలను నివారించి, నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు రామాంజనేయులు, సూక్కపురం అంజయ్య, శ్రీధర్ రెడ్డి, కటమోని జంగయ్య, ఆలకుంట మల్లేష్, కప్పర చంద్రయ్య, సురేందర్,సాయి రెడ్డి, మోటపురం యాదయ్య, బాల్‌రాజ్ , సిరిగిరి జంగయ్య, జల్లయ్య, పోలే కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్‌పై స్పీడ్ లిమిట్ తగ్గించండి - రవాణా శాఖ కమిషనర్‌కు సజ్జనర్ విజ్ఞప్తి

**హైదరాబాద్ :** హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్‌పై) ప్రమాదాలు పెరుగుతున్నాయి. వాహనాల అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఓఆర్ఆర్‌పై ప్రస్తుతం అమలులో ఉన్న గరిష్ఠ వేగ పరిమితిని గంటకు 120 కి.మి. నుంచి 100 కి.మి.కు తగ్గించాలని కోరుతూ ఇటీవల హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తికి లేఖలో విజ్ఞప్తి చేశారు.సచివాలయంలో విస్తృతంగా చర్చఈ అంశంపై రవాణాశాఖ కమిషనర్ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్)కు అక్టోబరు 9న లేఖ రాశారు. సరైన అధ్యయనం లేకుండానే గతంలో ఓఆర్ఆర్‌పై వేగ పరిమితిని పెంచారని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు. శాస్త్రీయ అధ్యయనం లేకుండానే 2023 జులైలో ఇక్కడి వేగ పరిమితిని 120 కిలోమీటర్లకు పెంచారని ఆయన పేర్కొన్నారు. అయితే ఓఆర్?ఆర్‌పై వేగపరిమితి 2023 జులై 27 వరకు 100 కిలోమీటర్లుగా ఉండేది. ఈ సంవత్సరం జులై 28వ తేదీ నుంచి గరిష్ఠ వేగాన్ని 120 కిలోమీటర్లకు పెంచడంతోనే ఈ రోడ్డుపై



ప్రమాదాలు పెరిగాయి. ఈ అంశంపై సెప్టెంబరు 18న సచివాలయంలో విస్తృతంగా చర్చలు జరిగాయి.ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగుతున్నట్లు సంయుక్త తనిఖీల్లో తెలిసిందని సీపీ సజ్జనార్? తన లేఖలో పేర్కొన్నారు. ఇవి 'సేఫ్టీ విత్ స్పీడ్' అనే ఓఆర్ఆర్ లక్ష్యానికి విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఓఆర్ఆర్‌పైకి బైక్?లు రావడం, ఇతర వాహనాలను ఓవర్?టేక్? చేసే సందర్భాల్లో డ్రైవర్లు జిగ్‌జాగ్ పద్ధతిలో వెళ్లడం చేస్తున్నారు. నెమ్మదిగా కదిలే వాటర్ ట్యాంకర్లతో డివైడర్‌పై మొక్కలకు నీరు పోయడం, వాహనాలను ఆకస్మికంగా నిలపడం తదితర చర్యలు కారణంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఓఆర్?ఆర్?పై గరిష్ఠ వేగ పరిమితిని గంటకు 100 కిలోమీటర్లకు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని లేఖలో స్పష్టం చేశారు.గరిష్ఠ వేగాన్ని తగ్గించాలి2023 జులై 28 నాటి నోటిఫికేషన్‌తో ఓఆర్ఆర్‌పై తొలి రెండు లేన్లలో గరిష్ఠ వేగ పరిమితిని గంటకు 120 కి.మి.కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కనిష్ఠ వేగాన్ని 80 కి.మి.గా నిర్ణయించారు. శాస్త్రీయ పద్ధతిలో అ ఇలంబర్తి తన లేఖలో పేర్కొన్నరు. ఓఆర్?ఆర్?పై వేగ ప? అధికారులు గుర్తించారు. కనీసం 30 అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. 120 కిలోమీటర్ల వేగపరిమితి ఉన్న 2016 సంవత్సరంలో 1545, 2017లో 1562 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని వేగ పరిమితిని 100 కిలోమీటర్లకు తగ్గించారు. దీంతో 2018 సంత్సరంలో 618 ప్రమదాలు జరగగా, 2019లో 782, 2020లో 641, 2021లో 840, 2022లో 1029కి పరిమితమయ్యాయి. కాగా 2023 గరిష్ఠ వేగాన్ని సవరించి 120 కిలోమీటర్లకు పెంచడంతో 1402, 2024లో - 1592కి పెరిగాయి.

# యువత రీల్ లైఫ్ కాదు.. రియల్ లైఫ్‌లో బతకాలి

**హైదరాబాద్ :**సిద్దిపేట జిల్లా, అక్టోబరు 11 సిద్దిపేట యువతతో (ఆదివారం) నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పలు సూచనలు చేశారు. రీల్ లైఫ్ కాదని.. రియల్ లైఫ్‌లో బతకాలని యువతకు మార్గనిర్దేశం చేశారు. వారు ఆన్‌లైన్ గేమ్స్ ఉచ్చులో పడొద్దని.. డ్రగ్స్, వ్యసనాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. యువత లక్ష్యాన్ని చేరుకోవాలంటే టైమ్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యమని తెలిపారు. లక్ష్యంపై దృష్టి పెట్టాలని.. అప్పుడే విజయం సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సిద్దిపేటలో నాణ్యమైన కోచింగ్ వంటి పలు అంశాలపైనా హరీశ్‌రావు మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధిపై.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అభివృద్ధిలో సమూల మార్పునకు కారణమైందని హరీశ్‌రావు తెలిపారు. ఒకప్పుడు ఈ రాష్ట్రానికి నీళ్లు రావన్నవాళ్లే.. ఇప్పుడు కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులు అభివృద్ధికి గుండెకాయలయ్యాయని అంటున్నారని చెప్పారు.



తెలంగాణ వచ్చాక పంట దిగుబడులు భారీగా పెరిగాయని వెల్లడించారు. ఒకప్పుడు భూమి, ఆస్తి.. ఇప్పుడు ఆదాయ వనరు అని చెప్పుకొచ్చారు.మాజీ సీఎం కేసీఆర్ విజనరీ పర్సన్..మాజీ సీఎం కేసీఆర్ విజనరీ పర్సన్.. ఫైటర్ అని హరీశ్‌రావు అభివర్ణించారు. తెలంగాణ భవిష్యత్తు అద్భుతమని.. దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. పదవుల కోసం ఈ రాష్ట్ర నినాదాన్ని వాడుకోలేదని చెప్పారు. పదవులను త్యాగం చేసి ఉద్యమాన్ని నడిపించారని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకున్నాయని వివరించారు.సిద్దిపేటతో అనుబంధం..సిద్దిపేట ప్రజలకు ఆజన్మాంతం రుణపడి ఉంటానని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తాను ఏడుసార్లు పోటీ చేస్తే.. ఆరుసార్లు ప్రత్యర్థులకు డిపాజిట్ రాలేదని చెప్పారు. ఇక్కడి ప్రజలకు ఎదిగిన కొడుకులాంటి వాడిగా ఉంటానని అన్నారు. సిద్దిపేట ప్రేమకు, ఆతిథ్యానికి నిలయమని తెలిపారు. ఒకప్పుడు ఎన్నికల నినాదాలుగా ఉన్న గోదావరి జలాలు, జిల్లా ఏర్పాటు, రైలు కలలను నిజం చేసుకున్నామని వెల్లడించారు.సిద్దిపేటలోనే నాణ్యమైన కోచింగ్.హైదరాబాద్‌లో లభించే నాణ్యమైన కోచింగ్‌ను సిద్దిపేట యువతకు ఇక్కడే అందిస్తున్నామని వివరించారు. యువతకు కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమని చెప్పారు. స్వతంత్రంగా నిలబడగలిగినప్పుడే జీవిత భాగస్వామిని ఎంచుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

# క్యూర్ ప్రాంతంలో ప్రకటనలకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్:**
ప్రాంతంలో తాత్కాలిక, హైపర్‌లోకల్ ప్రకటనలకు సంబంధించి తెలంగాణ ప్రభు త్వం కొత్త మార్గదర్శ కాలు జారీ చేసింది. ప్రతి వార్డుకు ఒక అడ్వర్టయిజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్‌ను నియమించనున్నారు. తాత్కాలిక ప్రకటనలకు గరిష్ఠంగా 3 రోజులు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. అలాగే హైపర్‌లోకల్ ప్రకటనలకు గరిష్ఠంగా 7 రోజులపాటు అనుమతి ఉండనుంది. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే యాడ్స్‌ను వెంటనే తొలగించడంతో పాటు జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.పబ్లిక్ ప్రాపర్టీ, చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రకటనలు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. అదేవిధంగా ట్రాఫిక్, పాదచారుల మార్గాలు, సిగ్నల్స్, జజుఎలకు ఆటంకం కలిగించేలా యాడ్స్ పెట్టరాదని ఆదేశించింది. కొత్త మార్గదర్శకాల అమలు బాధ్యతలను జీహెచ్‌ఎంసీ, సీఎమ్‌సీ, ఎమ్‌ఎమ్‌సీ కమిషనర్లకు తెలంగాణ ప్రభుత్వం అప్పగించింది.

# పట్టభద్రులు ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలి



**మహబూబ్‌నగర్ :** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రులు ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేయిం చుకోవాలని బీఆర్ఎస్ నాయకు డు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేం దర్ రెడ్డి కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగా రెడ్డి,హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని బొమ్మరా స్పేట్, దుద్యాల కొడంగల్ , కొడంగల్ మున్సిపాలిటీ పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ ఆదివారం కొడంగల్‌లో ప్రారంభమైంది,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని కొత్త పట్టభద్రు లు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓటు ఉన్న పట్టభద్రులు కూడా తమ ఓటు వివరాలు సరిగా ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించు కోవాలని, ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా నమోదు చేసుకోవాల ని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి థర్మల్ ప్లాంటు నిర్మాణ వ్యయం భారీగా పెంపు

**మంచిర్యాల జిల్లా:** పెగడపల్లిలో సింగరేణి సంస్థ నిర్మిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటు నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తొలుత వేసిన అంచనాలతో పోలిస్తే ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరగడం చర్చనీయాంశ ంగా మారింది. 2024-25 లెక్కల ప్రకారం ఈ ప్లాంట్ నిర్మాణ వ్యయం రూ.9,697 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. గతంలో మెగా వాట్‌కు రూ.10.80 కోట్ల వరకు పెట్టుబడి అవసరం అవుతుందని భావించగా, ప్రస్తుతం ఆ మొత్తం రూ.11.99 కోట్లకు చేరింది. నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా నాలుగేళ్ల సమయం పడుతుందని అంచనా వేస్తుండటంతో భవిష్య త్తులో వ్యయం మరింత పెరిగే అవకాశాలు న్నాయి.యూనిట్ విద్యుత్‌కు రూ.5.61 - అదనంగా లైన్ల ఖర్చుఈ ప్లాంటులో ఉత్పత్తి చేసే విద్యుత్‌కు తొలి ఏడాది యూనిట్‌కు రూ.5.61 ఖర్చవుతుందని డిస్కంలు వెల్లడించాయి. దీనికి విద్యుత్ లైన్ల కిరాయి వ్యయంగా యూనిట్‌కు మరో రూ.60 పైసలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ.5.25కు మించరాదని జాతీయ సౌర విద్యుత్ సంస్థ ఇటీవల నిర్వహించిన టెండర్లలో తేలినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో థర్మల్ ప్లాంటు ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ ధరపై ప్రశ్నలు



తలెత్తుతున్నాయి. అయితే విద్యుత్ కొనుగోలు ధరతో పాటు సరఫరా విశ్వసనీయత, అందుబా టు, ఇతర నిర్వహణ ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ డిస్కంల కొనుగోలుకు ప్రతిపాద నపెగడపల్లి ప్లాంటులో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తొలుత రాజస్థాన్‌కు సరఫరా చేయాల ని యోచించినప్ప టికీ, తాజా గా తెలంగాణ డిస్కంలు తామే కొనుగోలు చేస్తామని తెలం గాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీ ఈఆర్‌సీ)కి పి టిషన్ దాఖలు చేశాయి. దీనికి అనుబం ధంగా తెలంగాణ దక్షిణ డిస్కం సమగ్ర ప్రాజెక్టు నివేది కను సమర్పించింది. ప్లాంటు నిర్మాణం ప్రారం భమైన తేదీ నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభి ంచడానికి 48 నెలల సమయం పడుతుందని నివేదికలో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 29న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ఈఆర్‌సీ తెలిపింది. ప్రాజెక్టు వ్యయం, విద్యుత్ ఉత్పత్తి ధర, వినియోగదారులపై పడే ఆర్థిక భారాన్ని ఈ విచారణలో పరిశీలించనున్నారు. ఈ ప్లాంటుకు ఒడిశాలోని నైనీ గని నుంచి ఏటా 40 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. సుమారు 800 కిలోమీటర్ల దూరం నుంచి బొగ్గును రవాణా చేయాల్సి ఉండటంతో రవాణా వ్యయం కూడా కీలకంగా మారనుంది. తెలంగాణలోని సింగరేణి గనులు సమీపంలోనే ఉన్నప్పటికీ, అవసరమైన నాణ్యత కలిగిన బొగ్గు అందుబాటులో లేకపోవడంతో నైనీ గనిపై ఆధారపడుతున్నట్లు సమాచారం.నీటి అవసరాలు - పెట్టుబడికి రుణాలే ఆధారంప్లాంటుకు అవసరమైన నీటి కోసం షట్‌పల్లి వద్ద గోదావరి నుంచి ఒక టీఎంసీ, దేవులవాడ వద్ద ప్రాణహిత నది పంపుహౌస్ నుంచి మరో రెండు టీఎంసీల నీటిని తీసుకోవాలని సింగరేణి ప్రతిపాదించింది. ప్రాజెక్టు మొత్తం పెట్టుబడిలో 75 శాతం నిధులను విద్యుత్ ఆర్థిక సంస్థల నుంచి రుణాలుగా సమీకరించాలని నిర్ణయించింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాంటు నిర్మాణాన్ని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

# టీ20 చరిత్రలో రెండోసారి అరుదైన రికార్డు

టీ20 క్రికెట్‌లో బ్యాటర్లు చెలరేగితే స్కోరు ఎంత భారీగా ఉంటుందో భారత్, వెస్టిండీస్ జట్లు మరోసారి చూపించాయి. అక్టోబర్ 9న రాంచీలో జరిగిన రెండో టీ20లో ఇరు జట్లు కలిసి 501 పరుగులు చేశాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో ఒక మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదవడం ఇది రెండోసారి. ఇంతకుముందు 2023లో సౌతాఫ్రికా, వెస్టిండీస్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 517 పరుగులు నమోదయ్యాయి. తాజా మ్యాచ్‌లో భారత్ 249/5 స్కోరు చేయగా, వెస్టిండీస్ 18.3 ఓవర్లలో 252/4తో లక్ష్యాన్ని అందుకుంది.సంజూ శాంసన్ విధ్వంసంటాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు భారీ స్కోరు సాధించింది. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కేవలం 41 బంతుల్లో 82 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. ఇషాన్ కిషన్ 22 బంతుల్లో 43 పరుగులు చేయగా, తిలక్ వర్మ 18 బంతుల్లో అజేయంగా 44 పరుగులు సాధించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 18 బంతుల్లో 40 పరుగులు చేయడంతో భారత్ స్కోరు 249/5కు చేరింది. ఈ స్కోరు భారీగా కనిపించినా, విండీస్ బ్యాటర్లు మరింత దూకుడుగా ఆడటంతో భారత జట్టుకు విజయం దక్కలేదు.షాయ్ హోప్ సెంచరీ250 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు కోల్పోవడం ఎదురుదెబ్బగా మారింది. అయినా కెప్టెన్ షాయ్ హోప్ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా బ్యాటింగ్ కొనసాగించాడు. అతడు కేవలం 45 బంతుల్లో అజేయంగా 102



పరుగులు చేశాడు. మరోవైపు షెర్ఫేన్ రదర్‌ఫోర్డ్ 37 బంతుల్లో 84 పరుగులతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను విండీస్ వైపు తిప్పారు. చివర్లో రొమారియో షెఫర్డ్ 13 బంతుల్లో అజేయంగా 34 పరుగులు చేయడంతో విండీస్ 252/4తో లక్ష్యాన్ని ఛేదించింది.భారత్‌పై వెస్టిండీస్ సాధించిన ఈ విజయం మరో అరుదైన రికార్డును సృష్టించింది. పురుషుల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 250 పరుగులు లేదా అంతకంటే ఎక్కువ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించడం ఇది రెండోసారి. 2023లో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌పై 259 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఈ విభాగంలో అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పుడు భారత్‌పై 250 పరుగుల లక్ష్యాన్ని అందుకున్న వెస్టిండీస్ రెండో స్థానంలో నిలిచింది. రాంచీ మ్యాచ్‌లో మొత్తం 501 పరుగులు నమోదవడంతో, భారత్‌లో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఇదే అత్యధిక పరుగుల సమాహారంగా నిలిచింది. ఈ ఏడాది భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో నమోదైన 499 పరుగుల

# బంగారం ధరల్లో మళ్లీ మార్పు.. 10 గ్రాముల రేటు ఎంతో తెలుసా?

బంగారం ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి.. బులియన్ మార్కెట్ లో ఒక్కోసారి ధర పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతుంటాయి.. అమెరికా-ఇరాన్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు.. ఇలా అంతర్జాతీయ పరిస్థితులు మార్కెట్ ధరలపై ప్రభావం చూపుతుంటాయి. కాగా.. ఇటీవల కాస్త తగ్గి ఊరటనిచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరిగాయి.. ఆ తర్వాత స్థిరంగా కొనసాగుతున్నాయి. పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా మంగళవారం అక్టోబర్ 6 ఉదయం 6 గంటల వరకు దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ10 మేర తగ్గి.. రూ.1,49,170 గా ఉంది. 22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర 10 తగ్గి.. రూ.1,36,740 గా ఉంది.వెండి కిలో ధరపై రూ.100 మేర తగ్గి.. రూ.2,34,900 లుగా కొనసాగుతోంది.అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది. ప్రధాన నగరాల్లో ధరలు..హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,170 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,36,740 గా ఉంది.





వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,49,320, 22 క్యారెట్ల ధర రూ.1,36,890 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 గా ఉంది. వెండి కిలో ధర రూ.234,900 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రా ధర రూ.1,49,170, 22 క్యారెట్ల ధర రూ.1,36,740 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు.. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# భారత్ ఓటమికి ఎవరినీ నిందించను.. గంభీర్ చెప్పిన అసలు మాట ఇదే

భారత్, వెస్టిండీస్ మధ్య రాంచీలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 249 పరుగులు చేసింది. ఇంత భారీ స్కోరు చేసినా భారత్‌కు విజయం దక్కలేదు. వెస్టిండీస్ 18.3 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి 501 పరుగులు చేశాయి. పురుషుల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన రెండో జట్టుగా వెస్టిండీస్ నిలిచింది.భారత్ భారీ స్కోరు చేయడంలో బ్యాటర్లు కీలక పాత్ర పోషించారు. సంజూ శాంసన్ 33 బంతుల్లో 82 పరుగులు చేసి అదరగొట్టాడు. ఇషాన్ కిషన్ 43 పరుగులు చేయగా, శ్రేయస్ అయ్యర్ 40, తిలక్ వర్మ 44 పరుగులతో రాణించారు. అయితే వెస్టిండీస్ బౌలర్ రోస్టన్ చేజ్ మధ్య ఓవర్లలో మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబేలను ఔట్ చేసి భారత్ పరుగుల వేగానికి కొంతవరకు అడ్డుకట్ట వేశాడు. అతని బౌలింగ్ మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచిందని కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసించాడు.ఓటమికి ఎవరినీ నిందించను: గంభీర్భారీ స్కోరు చేసినా మ్యాచ్‌ను కాపాడుకోలేకపోవడంపై గంభీర్ స్పందించాడు. "నేను ఎవరినీ నిందించను. 250 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయాం. వెస్టిండీస్ అద్భుతంగా ఆడింది. ఆ జట్టు విజయానికి అర్హమైనదే" అని స్పష్టం చేశాడు. క్యాచ్‌లు మిస్



కావడం క్రికెట్‌లో సహజమని, ఎవరూ కావాలని క్యాచ్ వదలరని చెప్పాడు. ఓటమికి ఒక్క ఆటగాడిని బాధ్యుడిగా చూపించడం సరికాదని, జట్టుగా ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపాడు.షాయ్ హోప్, రూథర్‌ఫోర్డ్ విధ్వంసం250 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. అయినా కెప్టెన్ షాయ్ హోప్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అతను 45 బంతుల్లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 37 బంతుల్లో 84 పరుగులు చేసి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 120 పరుగులు జోడించి మ్యాచ్‌ను వెస్టిండీస్ వైపు తిప్పారు. భారత బౌలర్ మయాంక్ యాదవ్ మూడు వికెట్లు తీసినా, ప్రత్యర్థి పరుగుల వేగాన్ని ఆపలేకపోయాడు.బ్యాటర్లకు అనుకూలించిన పిచ్రాత్రి సమయంలో మైదానంలో మంచు ఎక్కువగా పడటంతో బంతిని పట్టుకోవడం బౌలర్లకు కష్టమైంది.

# 20 ఏళ్ల పెట్టుబడి ప్రణాళిక.. దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి..?

భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టడం అంటే ప్రతి నెల కొంత మొత్తాన్ని సేవింగ్స్‌లోకి మళ్లించడం మాత్రమే కాదు. ఏ లక్ష్యం కోసం ఎంత డబ్బు అవసరం? ఆ డబ్బు ఎప్పుడు అవసరం? అందుకోసం ఇప్పటి నుంచి ఎంత పెట్టుబడి చేయాలి? అనే విషయాలను ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవడం చాలా ముఖ్యం. 20 ఏళ్ల వంటి దీర్ఘకాలిక ప్రణాళికలో ఈ విధానం మరింత ఉపయోగకరంగా ఉంటుంది. రాబోయే 20 ఏళ్లలో ఎదురయ్యే ప్రధాన ఆర్థిక అవసరాలను ముందుగా రాసుకోవాలి.

భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత

20 ఏళ్లకు రూపొందించే పెట్టుబడి ప్రణాళికలో.. ముందుగా భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇల్లు కొనడం, పిల్లల ఉన్నత విద్య, పిల్లల వివాహం, రిటైర్మెంట్ వంటి భారీ లక్ష్యాలను ఇందులో చేర్చాలి. ప్రతి లక్ష్యానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని, దాన్ని సాధించాల్సిన తేదీని నిర్ణయించుకోవాలి.

అన్ని లక్ష్యాల కోసం ఒకే పెట్టుబడి బకెట్‌ను ఉపయోగించడం కంటే ఒక్కో లక్ష్యానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం మంచిది. సాధారణంగా ఏడాదిలోపు అవసరమయ్యే లక్ష్యాలను స్వల్పకాలికంగా, 1--8 ఏళ్ల మధ్య లక్ష్యాలను మధ్యకాలికంగా, 8 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ సమయం ఉన్న లక్ష్యాలను దీర్ఘకాలికంగా పరిగణించవచ్చు.

ద్రవ్యోల్బణాన్ని మర్చిపోవద్దు

ఈ రోజు ఒక లక్ష్యానికి అవసరమయ్యే మొత్తం, 10 లేదా 15 ఏళ్ల తర్వాత అదే మొత్తంగా ఉండకపోవచ్చు. విద్య, ఇల్లు, వైద్యం వంటి



ఖర్చులు కాలక్రమంలో పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల భవిష్యత్ లక్ష్యాన్ని లెక్కించేటప్పుడు ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

తక్కువ కాలంలో అవసరమయ్యే డబ్బుకు స్థిరత్వం, లిక్విడిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు 15--20 ఏళ్ల తర్వాత అవసరమయ్యే డబ్బుకు మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకునేంత సమయం ఉంటుంది. కాబట్టి పెట్టుబడి ఎంపికలో లక్ష్య కాలవ్యవధి, రిస్క్ తీసుకునే సామర్థ్యం, వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. వివిధ ఆస్తి వర్గాల్లో పెట్టుబడులు విభజించడం ద్వారా రిస్క్‌ను కొంత మేర తగ్గించుకోవచ్చు, అయితే నష్టాల అవకాశాన్ని పూర్తిగా తొలగించలేం.

రిటైర్మెంట్‌కు ప్రత్యేక స్థానం

ఇల్లు, పిల్లల చదువు వంటి సమీప లక్ష్యాల మధ్య రిటైర్మెంట్ కోసం పెట్టుబడిని వాయిదా వేయకూడదు. 20 ఏళ్ల ఆర్థిక ప్రణాళికలో రిటైర్మెంట్ లక్ష్యానికి ముందుగానే స్థానం కల్పించాలి. దీర్ఘకాలిక రిటైర్మెంట్ పొదుపు కోసం కూడా ఒక ఎంపికగా పరిగణించవచ్చు.

ప్రతి ఏడాది ప్రణాళికను సమీక్షించాలి

పెట్టుబడి ఎంత రాబడి ఇచ్చిందనే దానికంటే, అది నిర్దేశించిన ఆర్థిక లక్ష్యానికి చేరువ చేస్తుందా లేదా అనేది ముఖ్యం. కనీసం ఏడాదికి ఒకసారి ప్రణాళికను సమీక్షించాలి. ఆదాయం, ఖర్చులు, కుటుంబ పరిస్థితులు లేదా ఉద్యోగంలో మార్పులు వచ్చినప్పుడు కూడా పెట్టుబడి ప్రణాళికను సవరించాలి.

ఆదాయం పెరిగినప్పుడు పెట్టుబడినీ పెంచాలి

20 ఏళ్ల ప్రణాళికను ప్రారంభించిన మొత్తంతోనే కొనసాగించాల్సిన అవసరం లేదు. ఆదాయం పెరిగే కొద్దీ పెట్టుబడిని కూడా

# 2031 వరకు కొత్త టోర్నీ లేనట్టే.. ఐసీసీకి షాకిచ్చిన బీసీసీఐ..?

క్రికెట్ క్యాలెండర్‌లో ఇప్పటికే ఉన్న అంతర్జాతీయ టోర్నమెం ట్లతో షెడ్యూల్ నిండిపోయింది. ఈ పరిస్థితుల్లో కొత్త పోటీలకు అవకాశం లేదని భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ స్పష్టం చేసినట్టు సమాచారం. దుబాయ్ లో జరిగిన ఐసీసీ క్రికెట్ ఆపరే షన్స్ వర్క్‌షాప్‌లో ఈ అంశంపై నెలల పాటు చర్చలు జరిగినా, కొత్త టోర్నమెంట్ ప్రతిపాదన లేకుండానే సమావేశం ముగి సింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆదాయాన్ని పెంచే మార్గాలపై ఐసీసీకి మెకిన్సే అండ్ కంపెనీ వ్యూహాత్మక నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. అందులో భాగంగా టీ20 ఫ్రాంచైజీ జట్లతో వరల్డ్ క్లబ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం, ఖాళీగా ఉన్న షెడ్యూల్ విండోల్లో నాలుగు దేశాల టీ20 టోర్నమెంట్లు ఏర్పాటు చేయడం వంటి ఆలోచనలు పరిశీలనకు వచ్చాయి. ఈ ప్రతిపాదనలకు మూడు ప్రధాన క్రికెట్ బోర్డులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆటగాళ్ల బిజీ షెడ్యూల్‌లో కొత్త టోర్నీలకు స్థలం లేదని అవి స్పష్టం చేశాయి. కొత్త పోటీని చేర్చాలంటే వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్



లేదా చాంపియన్స్ ట్రోఫీ వంటి ప్రస్తుత ప్రధాన టోర్నమెంట్లలో ఏదో ఒకదాన్ని తగ్గించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. అలాంటి మార్పు సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమైంది.ఇక ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (ఔిజ)కు సంబంధించి మార్పు వచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది నుంచి డబ్ల్యూటీసీని 9 జట్లతో ఉన్న ప్రస్తుత ఫార్మాట్ నుంచి 12 జట్లకు పెంచే ఆలోచన ఉన్నట్టు సమాచారం. ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వేలను కూడా టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో చేర్చే అవకాశం ఉంది. దీనిపై ఐసీసీ ఇంకా అధికారిక ప్రణాళికను సభ్య బోర్డులకు పంపలేదు. 2031 వరకు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ తమ ద్వైపాక్షిక షెడ్యూళ్లను ఖరారు చేసుకున్నట్టు నివేదిక పేర్కొంది. 2027 ఇంగ్లిష్ సమ్మర్‌లో తదుపరి డబ్ల్యూటీసీ యాషెస్‌తో ప్రారంభం కానుంది. 2028 ఆరంభంలో

# దీపావళికి బైక్ కొనాలని ప్లాన్ చేస్తున్నారా? దేశంలో అత్యంత చౌకైన 5 బైక్‌లు ఇవే..!

మీరు తక్కువ బడ్జెట్‌లో ఉండి, ఈ దీపావళి, పండుగ సీజన్‌లో కొత్త మోటార్‌సైకిల్ కొనాలనుకుంటే మార్కెట్‌లో అనేక కాంపాక్ట్ బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటి ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ. 58,000 నుండి మొదలవుతుంది. వీటిలో 100 సిసి నుండి 110 సిసి వరకు ఇంజిన్ సామర్థ్యం గల బైక్‌లు ఉన్నాయి. అలాగే రోజువారీ వాడకానికి వీటి మైలేజ్ కూడా బాగుంటుంది.హీరో హెచ్‌ఎఫ్ 100: అత్యంత తక్కువ బడ్జెట్‌లో కొత్త బైక్మీరు తక్కువ బడ్జెట్‌లో బైక్ కొనాలనుకుంటే హీరో ఎఖీ 100 అత్యంత చౌకైన ఎంపికలలో ఒకటి. సెప్టెంబర్ 2026లో ఈ బైక్ ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు 57,719 రూపాయలు. దీనితో ఇది ఈ జాబితాలో అత్యంత తక్కువ ధర కలిగిన బైక్‌గా నిలిచది.ఇంజిన్, ట్రాన్స్‌మిషన్: హీరో ఎఖీ 100 లో 97.2 ఛఛ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజన్ ఉంది. ఈ ఇంజన్ సుమారు 8 ూా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. కంపెనీ ప్రకారం, ఈ బైక్ సుమారు 65-70 ిఎజూశ్రీ మైలేజీని ఇస్తుంది. అయితే ఇది పరిస్థితిని బట్టి మారవచ్చు.ఫీచర్స్: ఇందులో 97.2 సిసి ఇంజన్, 4-స్పీడ్ గేర్‌బాక్స్, తక్కువ బరువు, అల్లాయ్ వీల్స్, డ్రమ్ బ్రేకులు, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ ఉన్నాయి. ఈ బైక్ రోజువారీ పట్టణ వినియోగానికి బాగుంటుంది.హీరో



హెచ్‌ఎఫ్ డీలక్స్:

ఈ జాబితాలో రెండవ అత్యంత చౌకైన బైక్ హెచ్‌ఎఫ్ డీలక్స్, దీని ఎక్స్-షోరూమ్ (ఢిల్లీ) ధర రూ. 59,998 నుండి ప్రారంభమవుతుంది. ఎఖీ డీలక్స్ 97.2 ఛఛ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఈ ఇంజన్ గరిష్టంగా 5.9ిఔ పవర్, 8.05 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ బైక్‌కు 4-స్పీడ్ గేర్‌బాక్స్ జత చేశారు. హీరో వెబ్‌సైట్ ప్రకారం, ఎఖీ డీలక్స్ ూాాూా× మైలేజ్ 68 ిఎజూశ్రీగా ఉంది.ఇంజిన్, మైలేజీ: ఎఖీ డీలక్స్ 97.2 ఛఛ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఈ ఇంజన్ గరిష్టంగా 5.9ిఔ పవర్, 8.05 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ బైక్‌కు 4-స్పీడ్ గేర్‌బాక్స్ జత చేసింది. హీరో వెబ్‌సైట్ ప్రకారం, ఎఖీ డీలక్స్ మైలేజ్ 68 ిఎజూశ్రీగా ఉంది.డీలక్స్ కొన్ని వేరియంట్లలో ఱ3ొ ఐడిల్ స్టాప్-స్టార్ట్ సిస్టమ్ ఉంటుంది. ఇది ట్రాఫిక్‌లో బైక్ ఎక్కువ సేపు నిశ్చలంగా ఉన్నప్పుడు ఇంజిన్‌ను ఆపివేసి, ఇంధనాన్ని ఆదా చేయడానికి సహాయపడుతుంది. ఇది కాకుండా ఇూజుచీూ ఫ్యూయల్ ఇంజెక్షన్, టెలిస్కోపిక్ ఫ్రంట్ సస్పెన్షన్, వెనుక అడ్జస్టబుల్ షాక్ అబ్జార్బర్, ×దీూ వంటి ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ 100 సిసి కంప్యూటర్ బైక్, ఆఫీసుకు, కాలేజీకి లేదా మార్కెట్‌కు రోజూ వెళ్లి రావడానికి ఒక బడ్జెట్ ఆప్షన్.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# దీపావళి కానుకగా 'రామాయణం: పార్ట్ 1'.



భారత సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణం: పార్ట్ 1'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కన్నడ రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రం 2026 నవంబర్ 5న దీపావళి పండుగకు ముందుగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నవరాత్రుల శుభ సందర్భంగా ఈ ప్రకటన చేస్తూ, చిత్రంలోని ప్రధాన తారాగణంతో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

ఆదివారం నాడు చిత్ర నిర్మాణ సంస్థలు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ విషయాన్ని వెల్లడించాయి. "ఇది రాముని యుగానికి ఆరంభం" అనే సందేశంతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్‌లో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే, రావణుడిగా యశ్ కనిపించారు. దసరా పండుగ నుంచి సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.'దంగల్' ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ రామాయణ గాథను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మొదటి భాగం 2026లో రానుండగా, 'రామాయణం: పార్ట్ 2'ను 2027 దీపావళికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ చిత్రాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు.భారతీయ పురాణానికి ఆధునిక సాంకేతికతను జోడించి, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 8 సార్లు ఆస్కార్ అవార్డు గెలుచుకున్న డీఎన్‌ఈజీ (ఐచీజు+) సంస్థ దీనికి విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తుండటం విశేషం. ఏ.ఆర్. రెహమాన్‌తో పాటు హాలీవుడ్ లెజెండరీ కంపోజర్ హాన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయనుండగా, హిందీ మార్కెట్‌లో ధర్మ ప్రొడక్షన్స్ విడుదల చేయనుంది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు ఐమ్యాక్స్ (×హీూశ) ఫార్మాట్‌లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# టాలీవుడ్‌లోకి మరో వారసురాలు..

## హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్న శ్రీకాంత్ కుమార్తె మేధ





టాలీవుడ్‌లోకి మరో ప్రముఖ నటుడి వారసురాలు అడుగుపెడుతున్నారు. సీనియర్ నటుడు శ్రీకాంత్, ఒకప్పటి నటి ఊహ దంపతుల కుమార్తె మేధ కథానాయికగా పరిచయం కాబోతోంది. టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థగా ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఈ మేరకు ఆ సంస్థ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది.ఈ చిత్రంలో 'రాజమండ్రి రోజ్ మిల్క్' చిత్రంతో గుర్తింపు పొందిన జై జాస్తి హీరోగా నటిస్తున్నాడు. యువతను ఆకట్టుకున్న '30 వెడ్స్ 21' వెబ్ సిరీస్ దర్శకుడు పృథ్వీ వనం ఈ ప్రేమకథకు దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును చవీవ్ష్రతీఱ×ఊాశీజవ అనే హ్యాష్‌ట్యాగ్‌తో ప్రమోట్ చేస్తున్నారు. "మా మనసులను గెలుచుకున్న ఇద్దరినీ పరిచయం చేస్తున్నాం. ఈ రోజు మీకు వారి పేర్లు తెలుస్తాయి. రేపు వారిని చూసి మీరు కూడా ప్రేమలో పడతారు" అంటూ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతేకాకుండా 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేశ్ బాబు పి ఈ ప్రాజెక్టుకు క్రియేటర్/షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.మేధాకు నటన కొత్తేమీ కాదు. గతంలో అనుష్క ప్రధాన పాత్రలో నటించిన చారిత్రక చిత్రం 'రుద్రమదేవి'లో చిన్నప్పటి రుద్రమదేవి పాత్రలో నటించి మెప్పించింది. శ్రీకాంత్ కుమారుడు రోషన్ ఇప్పటికే 'పెళ్లి సందడి', 'ఛాంపియన్' వంటి చిత్రాలతో హీరోగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అతడి సోదరి మేధ కూడా హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుండడం విశేషం.

ఈ కొత్త ప్రేమకథకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ను రేపు (అక్టోబర్ 12) ఉదయం 10:26 గంటలకు విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ ప్రకటనతో శ్రీకాంత్ అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# గాయనిగా మారిన ఊర్వశి రౌతేలా.. తొలి ఈడీఎం సింగర్ గా ఘనత!

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనలోని మరో కొత్త ప్రతిభను బయటపెట్టారు. నటిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు గాయనిగా కొత్త అవతారం ఎత్తారు. 'హార్ట్ కంట్రోలర్' పేరుతో ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ (ఈడీఎం) ట్రాక్‌తో సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. విశేషమేమిటంటే, ఈ పాటకు ఆమె స్వయంగా గాత్రం అందించడమే కాకుండా, సాహిత్యం కూడా సమకూర్చారు.ఈ సందర్భంగా ఊర్వశి తన సంగీత ప్రయాణం గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ అంటే నాకు ఎప్పటినుంచో ఆసక్తి ఉంది. ఒక నటిగా నా ఇమేజ్‌కు అదనంగా కాకుండా, ఈ సంగీతంలోనే ఒక గాయనిగా, రచయిత్రిగా నన్ను నేను చూసుకోవాలనుకున్నాను. బాలీవుడ్ చరిత్రలోనే పూర్తి స్థాయి ఈడీఎం పాటను ఆలపించిన తొలి ప్రధాన గాయనిని నేనే కావడం గర్వంగా ఉంది" అని ఆమె తెలిపారు.

ఈ పాట టైటిల్ వెనుక ఉన్న అర్థాన్ని కూడా ఊర్వశి వివరించారు. ""హార్ట్ కంట్రోలర్' అనే పదం నా పేరు 'ఊర్వశి' నుంచే వచ్చింది. ఇందులో 'ఉర్' అంటే హృదయం, 'వశి' అంటే నియంత్రించేది. అందుకే ఈ పేరు పెట్టాను. ఈ పాటలో నేను మరో మహిళ గురించి పాడటం లేదు, నా గురించే పాడుకుంటున్నాను" అని ఆమె స్పష్టం చేశారు. ఈ పాట కేవలం సంగీతం మాత్రమే కాదని, ఇందులో మహాభారత ప్రస్తావన, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కూడా మిళితమై ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. తన ఇంటిపేరైన 'రౌతేలా'ను కూడా ఉద్దేశపూర్వకంగానే సాహిత్యంలో చేర్చినట్లు చెప్పారు.హాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నిర్మాతలు అస్లాన్, తైమూర్ జానా, ఓరియంటల్ హౌస్‌తో కలిసి ఈ పాటను రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పాట విన్నవారు మంచి స్పందన ఇస్తున్నారని, ఇకపై ఈ పాట తనది మాత్రమే కాదని, శ్రోతలందరిదీ అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

సన్నీ డియోల్ సరసన 'సింగ్ సాబ్ ది గ్రేట్' చిత్రంతో ఊర్వశి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 'సనమ్ రే', 'గ్రేట్ గ్రాండ్ మస్తీ', 'హేట్ స్టోరీ 4' వంటి చిత్రాలతో పాటు 'కాబిల్' సినిమాలో ఒక ప్రత్యేక గీతంలోనూ కనిపించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులోనూ బాలకృష్ణ సరసన 'డాకూ మహరాజ్' చిత్రంలో నటించారు. చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' చిత్రంలో ఓ ఐటమ్ నెంబర్ లో మెరిశారు.




# రవితేజ 'తులాభారం'

మాస్ మహరాజ రవితేజ హీరోగా, వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఓ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో సినిమా అంటేనే అభిమానులు ఏ రేంజ్‌లో అంచనాలను పెంచుకున్నారు. రవితేజ 78వ సినిమా తెరకెక్కుతున్న ఈ చిత్రం టైటిల్‌ని ఆదివారం అనౌన్స్ చేశారు. ఇందుకు సంబంధించి 'టైటిల్ డాక్యుమెంటరీ' వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో సినిమాలో రవితేజతో పాటు హీరోయిన్లు ప్రియాంక మోహన్, అనస్వర రాజన్‌తో పాటు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న జెడి చక్రవర్తి, తరుణ్ భాస్కర్, అనిల్ కరెల్లా, రవి అంటోనీలతో సినిమాకి టైటిల్ ఏది బాగుంటుందనే చర్చ మనం చూడొచ్చు. ఒకరు క్రైమ్ థ్రిలర్ అని, మరొకరు పొలిటికల్ డ్రామా అని, ఇంకొకరు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, లవ్ స్టోరీ అని చెబుతూ వస్తారు. చివరకు అన్నిటిని బ్యాలెన్స్ చేస్తూ.. బ్యాలెన్సే ఈ సినిమా టైటిల్ అయితే బాగుంటుందని ఓ నిర్ణయానికి వస్తారు. ఫలితంగా ఈ సినిమాకి 'తులాభారం' అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారు. ఇక ఈ సినిమా నటిస్తున్న వాళ్ల పాత్రలను కూడా పరిచయం చేశారు. ఇక ఈ సినిమాని బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లక్ష్మణ్, శ్రీని రావు నిర్మిస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది

# లుక్ మార్చిన నాని..

## 'బ్లడీ రోమియో'గా మారిపోయారు..

రీసెంట్‌గా 'ది ప్యారడైజ్' సినిమాతో గ్రాండ్ సక్సెస్‌ని అందుకున్నారు నాని. ఇప్పుడు ఆయన తన తదుపరి సినిమా కోసం రెడీ అవుతున్నాడు. సుజీత్ దర్శకత్వంలో నాని నటించబోయే మూవీ 'బ్లడీ రోమియో'. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్ పతకాలపై వెంకట్ బోయనపల్లి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించి నాని పాత్ర లుక్ టెస్ట్ చేశారు. దసరా కానుకగా ఈ లుక్‌ను విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తోంది. పండగ తర్వాత సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ మూవీని వచ్చే ఏడాది ప్రారంభం నాటికి పూర్తి చేసి.. వేసవికి థియేటర్లలోకి తీసుకురావాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబు కానున్న ఈ సినిమాలో నాని గ్యాంగ్‌స్టర్ పాత్రలో అలరించనున్నారు



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613